# వేంకటేశ్వర మహాత్మ్యం

★

## కే డెం రామచంద్రన్

"సార్ మీకు ఫోన్ వచ్చింది" అన్నమాటతో తలెత్తాడు మోహన్.

ఎవరికి? నాకే? ఎక్కడనుంచి? ఎవరు ఫోన్ చేసింది? అన్న ప్రశ్నలకు ఆఫీసుబాయి యిచ్చిన సమాధానం '202 నుంచి సార్'' ఈ జవాబతనికి తృప్తి నివ్వకపోగా, మరికొంత ఆత్రుత నెక్కువ చేసింది. అతనింతవరకు చూస్తున్న డ్రాఫ్టు ఫైల్లో గుచ్చి ఫోనువైపు కదిలాడు.

"హల్లో! ఎవరూ ... చంద్రమా! నువ్వా? ఏంరా. ఏం సంగతి? షికారుకా? కాదూ! ఎవరూ మా శేషు పిన్ని మధ్యాహ్నం వచ్చిందా. తిరుమలకు ప్రయాణమిట్నా. అది ఈ సాయంత్రమే? ప్రయాణానికి అందరూ సిద్ధమవుతున్నారా? మా అమ్మగారు జారిచేసారా ఉత్తరువు. చాలా థాంక్స్‌రా. నేనూ యిప్పుడే బయలుదేరివస్తున్నా నువ్వు ఎక్కడికీ వెళ్ళొద్దు. మా రూంలోనే వుండు" చంద్రం సమాధానాన్ని ఆశించకుండా ఫోను పెట్టేశాడు మోహన్. అప్పుడే టంగుమన్న శబ్దం వినబడ్డంతో ఆఫీసు గోడగడియారం కేసి చూపు సారించాడు. గంట 5—30 అయిందని అతని కప్పటికి గానీ తెలియరాలేదు.

ఫైల్సు సర్ది బీరువాలో పెట్టడం, సూపరెంటెండెంట్‌వద్ద శలవు పుచ్చుకోవడం క్షణంలో జరిగిపోయింది. యూనివర్శిటీ ఆఫీసు వదలి సైకిలెక్కాడు. అతని ఆలోచనలన్నీ యింటిమీదే వున్నాయి. గిరింపేటనుండి శేషుపిన్ని ఒక్కర్తే వచ్చిందా? లేక చిన్నాన్నా, సుశీలా అందరూ వచ్చారా? ... కమల మనస్సులో రాగానే అతను కాస్త ఆందోళనపడ్డాడు. శేషు పిన్ని జ్యేష్టకుమార్తె కమల. స్కూలు ఫైనలు పాసయింది. ఆమెకే పెండ్లిచేయాలన్న పట్టుదలతో మోహన్ చిన్నాన్న వరాన్వేషణ మొదలు పెట్టాడు. ఆ పని ప్రారంభించేప్పటికి రెండు సంవత్సరాలు కావస్తోంది. కేలండర్ల కాగితాలు తొలుగుతున్నాయి కానీ, వివాహ ముహూర్తం నిశ్చయం కాలేదు. నచ్చిన సంబంధం కట్నాల విషయంలో నయితేనేమి, జాతక ఫలితాల వల్ల నయితే నేమి? దూరంకాజొచ్చింది. దగ్గరలో కమలకు పెండ్లియ్యే సూచన లేమీ కనబడ్డంలా. "కళాశాల" బస్సుహారన్‌తో మోహన్ ఆలోచనలన్ని పటాపంచలైపై. తలెత్తే లోపునే బస్సు రాకెట్‌లా తన్ను దాటిపోయింది.

అయిదు నిముషాల్లో యిల్లు చేరాడు మోహన్ "ఏం అన్నయ్యా! యింత ఆలస్యం?" గుమ్మంలో ఎదురవుతూ, కమల పలుకరించింది. "రేపు ఆదివారం కదూ? అందుకని పెండింగు పర్కంతా తెముల్చి వస్తున్నాను. కులాసేగా కమలా? సుశీ బాబు, చిన్నాన్నా, అందరూ వచ్చారా?" చొక్కా గుండీ విప్పుతూ అడిగాడు మోహన్. "నాన్నొక్కడే రాలేదన్నయ్యా. ఎవరో ఆఫీసరొస్తాడుట, రేపు ఆదివారమయినా, ప్రయాణం చేయవలసివున్నా, అది ఆపి, ఆయనగారికోసం ఆఫీసుకు వెళ్ళాలట!" ఇంట్లోకి ప్రవేశిస్తున్న అన్నను అనుసరిస్తూ, కమల సమాధానం యిచ్చింది. "గంట 6 అవుతున్నా యింటికి వస్తామన్న ధ్యాసే లేదుకదా వీడికి. శేషువాళ్ళొచ్చారని ప్రయాణం చేయాలనీ, చంద్రంచే ఫోన్లో చెప్పించి, ఎంతసేపయింది? యింటిముఖం పట్టాడా వీడు. కొంచెం కూడా భయం, భక్తి లేదు" మేఘగర్జనను తలదన్నేలాగున్న కృష్ణమ్మ మాటలు వింటూనే అమ్మగుణమెరిగిన మోహన్ చొక్కాతీసి, కమలకిచ్చి చంద్రం రూముకు పలాయనమయ్యాడు.

మోహన్‌కు చెప్పుకోతగ్గ మిత్రుడు చంద్రం ఒక్కడే అంటే ఆశ్చర్యపోనవసరం లేదు. చంద్రం పోస్టల్లో, మోహన్ యూనివర్శిటీలో పనిచేస్తున్నారు. యిద్దరూ పట్టభద్రులయిన వుద్యోగులే. మోహన్‌కు ఏడాదిక్రితం చంద్రంతో పరిచయమయింది. పరిచయం గాఢస్నేహంగా మారింది. మోహన్ ఎదురింటి మేడమీదే చంద్రం మకాం. చంద్రానికి మోహన్ మాటంటే ఆట పట్టింపు లేదుగానీ, కృష్ణమ్మ మాటంటే మాచెడ్డ గురి. చెప్పిందే తడవు చేయందేకానీ తిరిగిరాడు. అందుకే కృష్ణమ్మ చంద్రాన్ని తలవని, పొగడని దినముంటూ లేదు. మోహన్ని తర్కించని, మందలించని రోజంతకన్నా లేదు. చంద్రం మాటకారి, మితభాషి. ఏ విషయాన్నయినా, తనంతట తానుగా ఆలోచించందే ఆ పనికిపూనుకోడు. పడతులంటే పెద్దాభిప్రాయం ఏమీ లేకపోయినా, వివాహమంటె వెయ్యి ఆమడల దూరంగుంటాడు. వారి మాట ఆట్టే పట్టించుకోడు. మోహన్ నైజం వేరు. పరిస్థితులకతీతుడు కాకూడదంటాడు. దాన్ని బట్టి మెలగాలంటాడు. అందరినీ మోసంచేయాలని అతని వుద్దేశ్యం కాదుకానీ, అబద్ధాలాడటం అలవాటే.

మోహన్ చంద్రం రూము చేరేలోపలే అతను గదికి తాళం వేస్తున్నాడు. చంద్రం సాధారణంగా ఆదివారాల్లో ప్రయాణం చెయ్యడు. అది తెలిసుండి తోడుకోసం తిరుమలకు రమ్మని కోరాడు మోహన్. అతనందుకంగీకరించలేదు కానీ, ఏ సహాయం కావాలన్నా, చేస్తానని మాట యిచ్చాడు. తిరుమలకు ఆరు బస్సుటిక్కెట్లు కొనమని తాము వచ్చేవరకు వేచియుండమని, యింటికి బయలుదేరాడు మోహన్. ఆదివరకే తనకోసం కాచుకొనివున్న అమ్మ తన్ను చూసి, చూడ్డంతోనే వడ్డించిన చివాట్లకు చిరునవ్వు నవ్వేసి, పెరటిగుమ్మం వయిపు నడిచాడు. 5 నిముషాల్లో గుడ్డలు మార్చటం, కాఫీ త్రాగటం అయింది. ఇంటికి తాళంవేసి, అందరూ బస్సు స్టాండు వయిపు బయలుదేరారు. టిక్కెట్లు చేత పట్టుకుని నవ్వుతూ తమవైపొస్తున్న చంద్రాన్ని కృష్ణమ్మ ప్రోధేయపడ్డంతో ఆమెమాటకెదురాడని చంద్రం తిరుమలకు ప్రయాణం చేయక తప్పింది కాదు. 6—30 గంటల ప్రాంతంలో జయజయ గోవిందనామ నినాదాలతో బస్సు స్టాండు వదిలింది.

అందులో సుమారు ముప్పైమంది ప్రయాణీకులయితే వుంటారు. దేవాదిదేవా, ఆపద్బాంధవా, ఆపద్మొక్కులవాడా, ఏడుకొండలవాడా, గోవిందా, గోవిందా" అని ఎలుగెత్తి ప్రార్థిస్తూంటేవారు కొందరు. అది వారి కంతరాయం కలిగినట్లు చీదరించుకుంటూ, రాజకీయాలు వారికిష్టమొచ్చినరీతిన నానా రభస చేసేవారు యింకొందరు, అందమయిన పడతులు తమవైపు తల త్రిప్పగనే అమితానందంతో వుబ్బి, తబ్బిబ్బయి వెకిలినవ్వులు నవ్వుకునేవారు మరి కొందరు. ఏ ధ్యాసాలేక కనులకింపయిన రమణీయ ప్రకృతి శోభను తిలకిస్తూ ఆనందమొందే మరికొందరు వీరేగాక, యింకొంతమందితో బస్సు పరిపూర్ణంగా నిండివుంది. మోహన్ పే కమిటీ చేసిన సిఫారసులను విపులంగా విశదీకరిస్తూంటె చంద్రం అన్నింటికీ పరధ్యాన్నంగా ఊఁ కొడుతున్నాడు. మోహన్‌కిది నచ్చలేదేమో, ఆ చర్చనీయాంశం ఆపేశాడు. ఇప్పుడిద్దరూ పాముపడగలా మెలికలు తిరిగిన ఆ సుందరమయిన బాటను, దాని కిరుపార్శ్వముల ఎత్తు లోతయిన లోయల దృశ్యాలను అందుకు ఆయువు పట్టయిన వివిధ ఫలపుష్ప వృక్ష సంతతిని దానికి జీవనాధారమయి అక్కడక్కడా కనుపించే చిన్న చిన్న చూడచక్కని యింపయిన జలపాతాలను ఒక్కటేమిటి, తమ కంటికి కనబడ్డ ప్రతిదీ తిలకిస్తున్నారు. కమల కూడా యించుమించు అదేపని చేస్తూంది. అయితే, మధ్యమధ్య బాబును బుజ్జగిస్తూంది. శేషమ్మ కమల వివాహ

విషయంలో తాము చేసిన ప్రయత్నాలన్నీ అక్కయ్య దగ్గర ఏకరువు పెడ్తోంది.

"అయితే, పూర్ణచంద్రం విషయంలో కూడ యింతే జరిగిందా?" యింతవరకు చెల్లెలు మాటలువింటున్న కృష్ణమ్మ దీర్ఘనిశ్వాసం వదు లుతూ అడిగింది.

"అవునక్కా, అబ్బాయియిష్టాయిష్టాల మీ కేముంది? రంగయ్యా, మంగమ్మ యిష్టపడొద్దు కనీసం అయిదు వేలు కట్నమిస్తే, ఈ సంబం ధం చేసుకోవడం ఖాయమని లేకపోతే లేదనీ, రంగయ్యా, మంగమ్మేమో సరేసరి తన అన్న కూతురుందిగా దాన్నిచ్చి చెయ్యాలని పట్టు"

"రంగనాథం ఏదో సంభందం తీసుకొచ్చేనే అదే మయింది?"

"ఏమవుతుందక్కా! బోలెడంత కుటుంబం. వారబ్బాయి తెచ్చే 70 రూపాయలు జీవనాధారం. వుంటున్న యిల్లు బాడుగది. మీ మర్ది గారికది యిష్టపట్టంలా."

"అంతకాక, మరి వారికిచ్చి కమల ముద్దు ముచ్చట్లేమిచేస్తామే. కానీ! మంచిసంభందం రాక పోతుందా? వెంకటాచలస్వామి దారిచూపకపోతాడా! నిదానించి చూద్దాం." కృష్ణమ్మ తన చెల్లెలు వయిపు తిరిగింది. "అరెరే! అదేంది శేషూ! ఎందుకలా గున్నావు, కమల కెన్నేండ్లయిందని? పట్టుమని పదిహేడన్నా లేవు, ఎందు కింత కంగారు వూరుకోవే, వూరుకో" సముదాయిస్తూ పలి కింది.

"అదేం కాదక్కా, మొన్నోసారి పెండ్లిచూపులకని ఎవరో స్నేహితు లొస్తారని ఆయన చెప్పారే. అంతా సిద్ధపడ్డాం. వారు రాగానే అన్ని ఏర్పాట్లూ ఏ లోటూ, లేకుండా చేశాం. ... కానీ ... శేషమ్మ గొంతు బొంగురు పోయింది. కానీ, ఏమయింది శేషూ, చెప్పవే ఏమయింది?" కృష్ణమ్మ చెల్లెల నోదారుస్తూ అడిగింది.

"కమలను పాటపాడమన్నాడా అబ్బాయి. అంత వరకు తల్లైనాఎత్తని కమల పాటెలా పాడగలదే! మనింట ఈ అలవాట్లన్నీ ఎక్కడుంది. అది మరీ సిగ్గుతో వంచినతల ఎత్తనయినా లేదు. అందుకని వారు మీ మర్దిగారితో అమ్మాయి కలుపు గోలు మనిషికాదనీ, మూగమొద్దనీ, గర్విష్టనీ, అదనీ, ఇదనీ, ఏమేమో అన్నారట. వారి మాటలు విని కమలను నానా చివాట్లూ పెట్టారే. చదివిం చిన చదువంతా దండుగట. చురుకుదనం ఏకో శానా లేదట. ఈ కాలంలో పాటపాడమంటే తడవుగా నాట్యంతోసహా చేసి, ఎదుటివారిని రంజింపచేయాలిట. ఈ కాలానికి తగ్గట్లు బుద్ధి, నడవడికలు మార్చుకోవాలిట. ఇంకా ఏమేమో అన్నారే. ఆ దినంనుండి కమలతీరు అదోవిధంగా వుందే. మనతో అనదుగానీ, అది లోలోన ఎంత బాధపడుతుందో నాకుతెలుసు." మరిక మాట్లాడ లేక పోయింది శేషమ్మ.

కృష్ణమ్మకు పట్టరాని ఆగ్రహం వచ్చింది. "ఏం కాలమే పాడుకాలం. పాటలంటే కడుపునిం పేది? సత్సాంప్రదాయమయిన కుటుంబీకులయితే యిట్లా ప్రవర్తించియుండేవారా? పదిమందిలో నా ఆటా, పాటా చూడండి, వినండంటూ, పెండ్లి కాబోయే పిల్లలు తైతక్క లాడతారా? ఎక్కడైనా. పదిరకాలవారు పెండ్లిచూపులకు వస్తే, అందరిముందూ తప్పనిసరిగా యిలా చేయాల్సిందేనా? ఇదేనా వారి పని. ఇదేమయినా భోగంకొంపా, లేక డ్రామా హాలా? వారి కెట్లా నోరాడిందే? కమలకు పాట్లు చెప్పడానికి. పోనీలే శేషూ! దానికే యిదయితే ఎలా? కమల కేమే, చెక్కెరబొమ్మలావుంది. వంటా, వార్పులో అందరి కన్నా మిన్నే. చదువు, సంధ్యా లేదా ఏం? స్కూలు ఫైనలు వరకు చదివింది. నీ వేమీ దిగులు పెట్టు కోకు. అది చిన్నపిల్ల. ఆ మాటా యీ మాట చెప్పి నచ్చచెప్పాలికానీ, నీవే దిగులు చెందితే ఎలా? చెల్లెలి నోదారుస్తూ, హితం పలుకుతోంది. కృష్ణమ్మ.

చంద్రం చూపు ఎక్కడో వున్నా, చెవి నిక్క బొడుచుకుని, వారి ప్రతిపలుకూ వింటున్నాడు. అతనికి కమలపై కరుణ కలిగింది. జాలేసింది. ఎన్నోసార్లు తటస్థపడ్డా ఆమెను సరిగా చూసి యుండలేదు. ఇప్పుడతనికి ఎందుకో కమల నోసారి చూడాలనిపించింది. రెండేండ్లయినా నిండని తమ్ముని చిలిపిచేష్టల సందడిలో పాలుపంచుకుం టున్న కమలను రెండు నిముషాలపాటు రెప్ప వాల్చ కుండా చూచాడు. ఉత్తమ గృహిణి కుండవలసిన లక్షణాలన్నీ అమరి యున్నాయి. కమల కట్టు, బొట్టు తీరు, అత్యంతాకర్షణీయంగా ఉంది. యవ్వనంలో వున్న ప్రతియువతీ ఆకర్షింపబడు తుంది. ఇది నైజం. కానీ ఆమెకు అద్వితీయ మయిన అందంకూడా జోడైవుంది. మాట, చూపు, నడకలో మనిషి గుణగణాల్ని తెలుసుకో వచ్చు నంటారు. చాలామంది. చంద్రం యిదివరకే నిర్ణయానికి వచ్చాడు. కమల అందరిలా అల్లరిపిల్ల కాదనీ, అందాల గుణవతనీ, యోగ్యతా, బాధ్యత తెలిసిన కమల వంటి శీలవతి అందరికీలభిస్తుందా! పూర్ణచంద్రం కమల విషయంలో పూర్తిగా పెడదారి పడ్డాడనుకున్నాడు. అతను చంద్రం క్లాసుమేటు. కాలేజీలో చదివే రోజుల్లో వర కట్నాల విషయంలో చాలా తీవ్రంగా అనేకసార్లు లెక్చర్లు యివ్వడం పత్రికలకు పదేపదే వ్యాసాలు వ్రాయడం, ఇదేమిటి? యింకా ఎన్నో చేశాడు. క్లాసంతా అనుకునేవారు, అతను బీదింటి ఏ బిడ్డనో ఎవరడ్డగించినా వివాహం చేసుకుతీరుతా డని. చంద్రంకూడా అంతే అనుకున్నాడు. కాని, యిప్పటి మాటలు అతనికి ఆశ్చర్యం కలిగించింది. చెప్పడం, వ్రాయటంలో వున్న తీవ్రత పట్టుదల దాన్నాచరించటంలో ఎందుకు చూపడంలేదో ఎందుకు వెనుకాడుతున్నాడో, అర్థం కాలేదు.

చంద్రం మనసెందుకో తరుచు కమలను గూర్చి తర్కిస్తోంది. వింత వింత ఆలోచనలతో అనేకవిధాల పరుగెడుతూంది. అతనికే ఆశ్చర్యం వేసింది. తనెందుకింతగా కమలను గూర్చి ఆలో చించడం? కరుణ చూపడం? అసలు ఆడువారిని గూర్చి యింతగా ఆలోచించడం యిదేమొదట సారి ఆలోచనలుమానుకుందామన్నా మనసొప్పటం లేదు. అతని బుద్ధి కేంతోచటం లేదు. పోనీ తనే కమలను పెండ్లాడితే? నువ్వా? ఆలోచించే నిర్ణ యానికొస్తున్నావా? హెచ్చరించింది హృదయం అవును నేనే! పెండ్లాడితే తప్పేముంది? తన కన్ని విధాలా తగిన పిల్ల. కమలకు మేలు చేసినవాడనవు తాను. తద్వారా వారి కుటుంబానికెంతో సహాయం చేసినవాడనవుతాను. ఈ తలంపు అతని వూహా పథంలోకి రాగానే అతని మనస్సు తత్తరపొందింది తెలియరాని అనుభూతి ఆవరించింది. అనురాగం తో చంద్రం నయనాలు కమల నొకసారి చూడ నిశ్చయించాయి. అనవసరంగా తను కమల విషయ ములో జోక్యం కల్గించుకుంటున్నాడా? ... అనవస రమా ? ... పోనీ అవసరమా? అయితే తప్పని సరిగా పెండ్లాడ దలిచాడా? ఏమో! ఒక్క కుదు పుతో బస్సు ఆగడంతో చంద్రం ఆలోచనలకు బ్రేకు పడింది.

సుమారు 8 గంటల ప్రాంతములో బస్సు తిరుమల చేరింది. ఎన్నోగంటలు తీవ్రకృషిచేయ సినా చిక్కలేదు రూము. మోహన్ ఎరిగినవారు ఎంక్వయిరీ ఆఫీసులో ఉండటంచేత, కొద్దిపాటి ప్రయాసతో రూం సంపాదించగలిగారు. తలా ఒక వస్తువు చేతపట్టుకుని బయలుదేరి పోతున్నారు. ట్రంకు కొద్దిపాటి బరువు ఎక్కువ కనుక దాన్నెవ రూ ముట్టుకోలేదు. మోహన్ బెడ్డింగు చేత పట్టుకుని ముందు పోతూండటం చేత, ట్రంకు మోయటం కమల వంతయింది. ఆమెచేతిలో అప్పటికే ఒక బ్యాగుఉంది. ట్రంకుకూడా ఎలా తీసుకుపోగలదు? కానీ తప్పదు కనుక, బేగు క్రింద నుంచి ట్రంకుమీద చెయ్యి పెట్టింది. అదే క్షణంలో చంద్రంకూడా ట్రంకు పై చెయ్యి వేయటం జరిగింది. ఇద్దరు ఒకసారి చూచుకు న్నారు. చంద్రం చూపులో నే తీసుకురానా? అన్నభావం ప్రస్ఫుటమవుతూంది. కమలకు సిగ్గేసింది. విడచిన బాగు చేతపట్టుకుని ఒక్క అంగలో ముందుపోతున్న అమ్మను కలుసుకుంది. ట్రంకుచేతపట్టుకునికమలకుకష్టం తగ్గించామని సంతోషపడుతూ చంద్రం వారి ననుసరించాడు. ఇదంతా రెండు నిముషాలలో జరిగిపోయింది.

అందరూరూము చేరారు. అప్పటికే కాలాతీత మయినందువల్ల ఎలాగూ శనివారం కావడం మూలాన హోటలు ఫలాహారంతో ఆకలి తీర్చుకుని కబుర్లు చెప్పుకోవడం పూర్తికాగానే ఎవరికి వారు వారి కిచ్చినచోట పడుకున్నారు. చంద్రం పడుకో న్నాడన్న మాటేగానీ, నిద్దుర పోవడం లేదు. కలిగిన పరిచయం తలుచుకుంటూన్నాడు. ఇంకా యింకా అలాంటి సన్నివేశాలు ఎన్నో తనకు కలి గించమని వేంకటేశ్వరస్వామిని మనసారా ధ్యానిస్తూ నిద్రాదేవి వడిలో పత్తిగిల్లాడు. ఒళ్లునా, లెమ్మనా తగలడంతో మెలుకువ కలిగింది, చంద్రానికి. తన చెయ్యిపై నీ రెలా పడింది? తల పైకెత్తి

మేశాడు. నిద్రమత్తంతా ఒక్కసారిగా వదిలిపోయింది. పైగా ఎక్కడలేని ఉత్సాహం కలిగింది. తనకు ముందుగా ఆరడుగుల దూరాన ఒక కుళాయి వుంది. నీరు పట్టుకుంటున్న కమల తన కోకిల కంఠంతో సుప్రభాతమాలాపిస్తూ, అక్కడ ప్రత్యక్షమయింది. నిద్దుర లేచీ లేవడంతో కనువిప్పగానే కమల కనపడటం, శ్రవణానందకరమయిన సుప్రభాతం వినడం, అందులోనూ కమల నోటిగుండా. శుభసూచక మనుకున్నాడు. ఇదంతా ఆ వేంకటేశ్వరస్వామి కరుణాకటాక్షమేనని, మరొకసారి ఆ స్వామిని మనసారా తలిచాడు.

కమల నీరు పట్టుకుని కూనిరాగం తీస్తూ తనవైపుకొస్తూంది. అంటే గుమ్మంవైపు కొస్తూంది. చంద్రం గుమ్మం ప్రక్కగా పడుకున్నాడు. ఆ తర్వాత మోహన్. కమల రావడంగమనించిన చంద్రం "కమలా ... కరా ... కమలనాభా ... వేంకటేశా ... ఇప్పుడు టైమెంత అయిందో" ఆవులిస్తూ అన్నాడు స్వగతంగా. కమల మొదట కాస్త జంకుపడ్డా నవ్వుకుంటూ గదిలోకి వెళ్ళిపోయింది. ఆశించిన సమాధానం రాకపోయేసరికి కొద్దిగా బాధపడ్డాడు. ఈమారు కమలతో తప్పక మాట్లాడాలనుకున్నాడు. చెంబు, బిందె, పట్టుకుని కమల బయటకు రావడంతో తను నోరు విప్పడుగానీ, మాటలు మాత్రం బయటకు రాలేదు. నీరు నింపుకుని వస్తున్న కమలను చూసి, లేచి కూర్చున్నాడు. కమల దగ్గరవుతున్నకొద్దీ మాట్లాడాలని ఆత్రుత హెచ్చుతోంది. కానీ దానితోపాటు గుండె కొట్టుకోవటం కూడా రెండు రెట్లధికమయింది. ఏది ఏమయినా మాట్లాడేసేయాలని అడుక్కున్నట్లుగా చెయ్యి పైకెత్తి, "ఏమండీ, టైమెంతయింది?" అని అడగాలనుకున్న తను కమల తనవైపు ముఖం త్రిప్పగానే "ఏమండీతో ..." ఆగిపోయింది మాటలు. కమల ఏమనుకుందో, ఏమో అతని చేతిలో చెంబుపెట్టి ముసిముసి నవ్వులతోముచ్చటగొలిపే నడకతో గదిలోకి పోయింది. చంద్రం తన అసహాయతకు సిగ్గుపడ్డాడు. "అమ్మా! గంట నాలుగయింది కదూ?" గదిలోంచి కమలన్న యీ మాటలు చంద్రం హృదయకమలాన్ని వికసింప చేసింది. సంతోషం పట్టలేక గంట నాలుగయింది లేవరా అంటూ మోహన్‌ను మోది లేపాడు. "అబ్బ! నాలుగయితేమాత్రం మెల్లగా లేపరా లేపేది?" వీపు తడుముకుంటూ లేచాడు మోహన్.

అయిదు గంటలకల్లా అందరూ స్నానపానాదులు పూర్తి చేసుకుని విశ్వరూప దర్శనం చేసుకోవడానికి ఏడుకొండలస్వామి దేవాలయానికే తెంచారు. తిరిగి రూము చేరడానికి ఒక్క గంటపట్టింది. కమలకు శీఘ్రంగా వివాహం జరిగితే కల్యాణఉత్సవం జరిపిస్తామని యింట మ్రొక్కింది చాలక, ఆపద్బాంధవుని సమక్షంలో మ్రొక్కుకోవడానికి ఏరంతా పని కట్టుకువచ్చారనిచంద్రంతెలుసుకున్నాడు. టిఫెన్ పూర్తికాగానే అందరూ పాపవినాశనమూ, ఆకాశగంగ, తీర్థాలను సేవించడానికి బయలుదేరారు. ప్రయాణం నిండుగా, హాయిగా ఆనందదాయకంగా ముగిసిందంటే అది చంద్రం మాటలలోని కమ్మని హాస్యప్రభావమే అనుకోవాలంది శేషమ్మ. దాన్ని బలపరిచింది కృష్ణమ్మ. చంద్రం హాస్యాని కన్న మాటలలోని ద్విపదార్థం కమలకు తెలుసు. తలుచుకున్నకొద్దీ ఆమెకామాటలలోనితీపి మత్తెక్కిస్తూంది. ఒక్కోసారి వెర్రిమరచిపోతున్నది. కానీ యిదంతా నిజమేనా? ఆ మాటల్లో తన్ను గురించేనా, లేక అమ్మావాళ్ళనుకున్నట్లు కేవలం హాస్యానికా? లేక ఎవరైనా అతని హృదయంలో స్థానం ఏర్పరచుకుని మవునం వహించి యున్నారా? ఏమిటిది? వేంకటేశ్వరా, వేంకటరమణా, ఏమిటి కొత్త పరీక్ష. నా మనస్సెందుకు యిలా మారుస్తున్నావు? చంద్రంవైపుకెందుకు యిలా తిప్పుతున్నావు? చంద్రం మాటలు వినాలంటే భయమేస్తూంది కమలకు. అతని మాటలలో ఎంతో ఆకర్షణ కనపడుతూంది. ప్రజ్ఞా విశేషాలతో పొందుపరచి వున్నాయ్. చంద్రానికి చాలా దూరంలో ఉంటూంది కమల. భోజనాలయ్యాయి. పాకశాస్త్ర నిపుణధురీణుడు, భీముని వంట ఆరగించినవారు ఈ భోజనం తిన్నారంటే అంతకు పదిరెట్లు ఆనందం పొందుతారని; వారీ యుగంలో లేకపోవటం వారి దురదృష్టమనీ ఆ వంటగురించి చంద్రం ప్రశంసించాడు. కమల హృదయాంతరాళంలోని వీణ మీటినట్లున్నా, పైకి చిరాకుగా కనుపించింది.

సకల చరాచర నాయకుడు, అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడు, శ్రీ వేంకటరమణుడు యథావిధిగా ప్రజాకోటికి దర్శనమిస్తున్నాడు. ఎన్ని మార్లు చూచినా, తనివి తీరని ఆ రత్నభూషణలంకార వజ్రకిరీట లక్ష్మీవక్షస్థల తిరుపతి వేంకటేశ్వరుని చూచి, తరించడానికి చూచిన వారే పదేపదే పోటీపడి చూస్తున్నారు. ప్రార్థిస్తున్నారు. మ్రొక్కుతున్నారు. మ్రొక్కులు చెల్లిస్తున్నారు. సకలవిధాలా వేడుకుంటున్నారు. మోహన్ ముందు నడువగా, శేషమ్మ, కృష్ణమ్మ, కమల, సుశీల, తర్వాత చంద్రం, నడుస్తున్నారు క్యూలో. కృష్ణమ్మ వరకు పోయిన క్యూ ఆగిపోయింది. చంద్రానికి సుశీలను, కమలనూ తీసుకువచ్చే బాధ్యత అప్పచెప్పి కృష్ణమ్మ ముందుకు వెళ్ళింది.

చంద్రం వెంకటేశ్వరస్వామిని తనేకంగాప్రార్థిస్తున్నాడు. ఆ గానానికి కమల హృదయభాండం అమృతంతో నిండినట్లయింది. ఎల్లాంటివారినైనా ఆ దివ్యమయిన ప్రశాంత వాతావరణం మార్చివేస్తూందంటే అతిశయోక్తి కాదు. దాని కా ప్రభావం వుంది. చంద్రం గానానికి తను రాగం జోడు కలిపింది కమల. యిద్దరూ స్తోత్రం చేసుకుంటూ పోతున్నారు. దివ్యతేజోమూర్తి, ఆ వేంకటేశ్వరస్వామి. లలిని సేవ చేసుకుంటూ, నిత్యం అతని సన్నిధానంలో మెలిగే ఆ బ్రాహ్మణోత్తములకది పూర్వపుణ్య సుకృతం కాక్క మరేమిటి పూజారిచ్చిన తీర్థం తీసుకుని కమల, చంద్రం ఒక్కసారే త్రాగారు. కమల ప్రక్కనుంటే అతనికి ఎనలేని ఆనందంగా వుంది. అప్రయత్నంగా, అనుకోకుండా అతని పెదవులపై పలుకులు నాట్యమాడాయి. "పరంధామా! వేంకటరమణా! కమల నా ప్రక్కనే ఎప్పుడూ వుండేటట్లు వరం ప్రసాదించు తండ్రీ! మనసులో అనుకున్న మాటలు పైకి వినవచ్చాయి. దేవాదిదేవున కప్పుడే హారతి యివ్వడం మూలాన భక్తిపూర్వక వచనాలతో ప్రతిధ్వనిల్లే ఆ గర్భాలయంలో చంద్రం మాటలు ఎవ్వరికీ వినవచ్చినవి కావు. హారతి నందుకుంటున్న కమలను పూజారి "శ్రీఘ్రమే కల్యాణమస్తు" అని దీవిస్తూంటే చంద్రం అందుకుని, "అలాగే నాకు దీవెన ప్రసాదించండి స్వామీ" అన్నాడు వినయపూర్వకంగా వచించిన యీ మాటలకీ అత్యంత శీఘ్రమే వివాహమస్తు"అని యిద్దరినీ దీవించాడు పుణ్యమూర్తి పూజారి. అదేక్షణంలో మ్రోగిన దేవాలయం గంటల మ్రోత"తథాస్తు" పలికినట్లయింది. చీకటి అలముకున్న కమల హృదయములో వేయి దీపాలు ఒక్కసారిగావెలిగినట్లయింది ఎక్కడో మ్రోగుతున్న మంగళ వాద్యాలు సన్నగా వినవచ్చాయి. చంద్రం సాహసానికీ చాతుర్యానికీ చిత్తయిపోయింది కమల. హృదయం. అందరూ రూము చేరడం, ఆదిన సాయంత్రమే తిరుపతికి బయలుదేరటం జరిగింది.

• •

కొద్దిరోజుల తరువాత కమల నాన్న సుందరయ్య పేరిట ఒక వుత్తరం వచ్చింది. అందులోని సారాంశం యిలా వుంది. చాలాకాలం తరువాత మా అబ్బాయికి వివాహం చేసుకోవాలన్న సుబుద్ధి ఆ ఏడుకొండల స్వామి సమక్షంలో కల్గటం మా అదృష్టం. మా అబ్బాయి గడుసుబుద్ధి మార్చ గలిగిన మీ పెద్దమ్మాయి కుమారి కమలను మా కోడలిగా చేసుకోవడానికి మేమెంతో సంతసపడుతున్నాము. మంచిరోజు చూసి జాబువ్రాసారంటే తక్షణమే బయలుదేరి రావడం జరుగుతుంది. ఆరోజే తాంబూలాదులు మార్చుకుని అప్పుడే ముహూర్త విషయం తేల్చుకుందాము. అబ్బాయి చి. చంద్రాన్నీ గూర్చి తెల్సుకోవాలనుకుంటే మా శ్రీమతి ద్వారా తెల్సుకోవచ్చు. ఇట్లు కాబోయే వియ్యంకులు — రాఘవయ్య.

జాబుసంగతి ఆ యింట అందరికీ క్షణాలమీద తెలిసిపోయింది. ఆ విషయం తేటతెల్లం కాగానే ఆ యింటిల్లపాదీ పొందిన ఆనందానికి అంతులేదు. ప్రతిఒక్కరి హృదయంలో తిరుపతి వేంకటేశ్వరస్వామి ప్రతిబింబమే మెదులుతూంది. ఆ కరుణామూర్తి మహాత్మ్యానికి అందరూ శతకోటి ప్రణామాలర్పించారు.

తన రెండేండ్ల తమ్ముడు వచ్చీరాని మాటలతో "అక్కయ్యా! యిదంతా ఏలుకొండలతాత మహత్తం అట, ఏదక్కయ్యా?" అంటూంటే "అవును బాబూ! యిదంతా ఆ ఏడుకొండల వేంకటేశ్వరుని మహాత్మ్యమేనంటూ బాబును తనకోమల హస్తాలతో దగ్గరకుతీసుకుంది. ★